తెయూలో నీటి కటకట.. రోడ్డెక్కిన విద్యార్థినులు

2




2
గాంధారి విద్యతో అద్భుతాలు



AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in


## ఆర్మూర్ ఎమ్మెల్యేను కలిసిన డీఎం..



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిని గురువారం ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ గా ఆమె ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యేను కలిసి మొక్కను అందజేశారు. ఆర్మూర్ ఆర్టీసీ డిపో అభివృద్ధికి సహకరించాలని కోరారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోపు పూర్తిచేయాలి



**అక్షరటుడే, ఇందూరు:** పారదర్శక ఓటరు జాబితా రూపకల్పన కోసం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పక్కాగా నిర్వహిస్తూ.. నిర్దేశిత గడువు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. గురువారం జిల్లాలోని పలు ప్రాంతాలను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిజామాబాద్ రూరల్ పరిధిలోని గాంధీనగర్ తండా, గూపన్‌పల్లి గ్రామాల్లో, నగరంలోని శంకర్‌భవన్ పాఠశాలలో ఎన్యుమరేషన్ ఫారంల స్వీకరణ వివరాల, నమోదు తీరును కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. ఇప్పటివరకు ఎస్ ఐఆర్ ప్రక్రియ పూర్తయిన శాతం.. ఓటర్లందరికీ ఎన్యుమరేషన్ ఫారంల పంపిణీ తదితర వివరాలను తెలుసుకున్నారు. అందుబాటులో లేని ఓటర్లకు కూడా సమాచారం అందించాలని సూచించారు. జీవనోపాధి కోసం విదేశాలకు వెళ్లిన వారి ఫారాలను జాగ్రత్తగా పరిశీలించాలని, వివరాలు సరి చూసుకున్న మీదట వారి కుటుంబ సభ్యుడి సంతకంతో తీసుకోవచ్చని కలెక్టర్ బీఎల్ఓలకు సూచించారు. ఫారంల స్వీకరణ, వివరాల డిజిటలైజేషన్ ఏకకాలంలో నిర్వహించాలని అన్నారు. ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారంలో పొందుపర్చిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, పక్కాగా నిర్ధారణ చేసుకోవాలని బీఎల్ఓ సూపర్‌వైజర్లను ఆదేశించారు. నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్, తహశీల్దార్ వినయ్ సాగర్ తదితరులు ఉన్నారు.



# స్కానింగ్ సెంటర్ల దోపిడీ..

ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం పేరుతో ఇష్టారాజ్యంగా దోపిడీ సాగుతోంది. కొందరు వైద్యులు తమకు అనుబంధంగా ఉన్న ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లను ప్రోత్సహిస్తూ రోగుల నుంచి వేలాది రూపాయలు గుంజుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**- అక్షరటుడే, కామారెడ్డి**

**■ వైద్యుల సిండికేట్‌తో రోగుల జేబులకు చిల్లు.. ■ అవసరం లేకున్నా టెస్టులకు సిఫార్సు ■ చెప్పిన చోట టెస్ట్ చేయిస్తేనే ఓకే.. లేదంటే మరోసారి టెస్టులు**

ఆస్పత్రుల్లో అవసరం లేకున్నా పరీక్షలు రాయడం, నిర్దేశించిన చోటే చేయించుకోవాలని ఒత్తిడి చేయడం వంటి పద్ధతులు సర్వసాధారణమయ్యాయి. దీనిపై వైద్యాధికారులు కూడా కళ్లు మూసుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. పట్టణంలో విచ్చలవిడిగా స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లు పుట్టుకొచ్చాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో పని చేసే వైద్యులు సిండికేట్‌గా మారి వీటిని ఏర్పాటు చేస్తున్నారు. వీటిపై ఫిర్యాదులు వస్తే సంబంధిత శాఖ అధికారులను పెద్దమొత్తంలో మేనేజ్ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవసరం లేకున్నా పరీక్షలు నిర్వహిస్తూ ప్రజల అమాయకత్వాన్ని క్యాష్ చేసుకుంటున్నారనే వాదన వినిపిస్తోంది.

### ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్ల ఏర్పాటు

కామారెడ్డి పట్టణంలో గత మూడేళ్లలో 15కి పైగా డయాగ్నస్టిక్ ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు ఏర్పాటు అయ్యాయి. వీటిలో చాలావరకు ప్రముఖ వైద్యుల బంధువులు, సన్నిహితుల పేరిట నడుస్తున్నట్లు సమాచారం. ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగిని నేరుగా ఈ సెంటర్లకు పంపే విధంగా ఒక అనధికారిక ఒప్పందం నడుస్తోందని రోగులు ఆరోపిస్తున్నారు. సంబంధిత ల్యాబ్, డయాగ్నస్టిక్ సెంటర్లకు సంబందించిన టెస్ట్ ప్రింట్ పేపర్స్ వైద్యుడి టేబుల్‌పై ముందుగానే ఉంచుతున్నారు.

### సాధారణ సమస్యతో వచ్చినా..

జ్వరం, తలనొప్పి వంటి సాధారణ సమస్యలతో వచ్చినా కూడా పూర్తి బాడీ చెకప్, సిటీ స్కాన్, ఎంఆర్ఐ వంటి ఖరీదైన పరీక్షలు రాయడం పరిపాటిగా మారింది. ఒకసారి అన్ని టెస్టులు చేయించుకుంటే మంచిది అంటూ వైద్యులు సూచిస్తున్నారు. దీంతో రూ.300 ఫీజుతో వచ్చిన రోగి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. స్కానింగ్, డయాగ్నస్టిక్ ఎంఆర్ఐ సెంటర్ నిర్వాహకులకు డిస్కౌంట్ ఇవ్వాలని కోరినా ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదు. అత్యంత దగ్గరి పరిచయం ఉన్న వైద్యులతో ఫోన్ చేయిస్తే మాత్రం ఇస్తున్నారు.

### చెప్పిన చోట టెస్ట్ చేయిస్తేనే ..

వైద్యులు రాసిన చోట కాకుండా రోగులు బయట మరో ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకుని వస్తే వాటిని పరిగణనలోకి తీసుకోవడం లేదు. మేము రాసిన ల్యాబ్‌లోనే చేయించుకోండి, అప్పుడే రిపోర్టు కరెక్ట్‌గా ఉంటుంది అంటూ తిరస్కరిస్తున్నారు. దీంతో రోగులు మళ్లీ అదే మొత్తం ఖర్చు చేసి టెస్టులు చేయించుకోవాల్సి వస్తోంది. ఇది స్పష్టమైన కమీషన్ వ్యవస్థ అని స్థానికులు మండిపడుతున్నారు.

### రూ.వేలల్లో దోచుకుంటున్న వైనం

ఒక్కో రోగి నుంచి సగటున రూ.3 వేల నుంచి రూ.8 వేల వరకు అదనపు ఖర్చు చేయిస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా అందాల్సిన సేవలు కూడా ప్రైవేట్ సెంటర్లకు తరలిస్తున్న ఘటనలు ఉన్నాయి. అక్కడ సౌకర్యాలు లేక బయటకు పంపిస్తున్నారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి.

### పట్టించుకోని వైద్యాధికారులు

డయాగ్నస్టిక్, ల్యాబ్, స్కానింగ్ సెంటర్ల అక్రమాలపై పలుమార్లు ఫిర్యాదులు అందినా జిల్లా వైద్యాధికారులు స్పందించడం లేదని తెలుస్తోంది. తనిఖీలు పేరుకు మాత్రమే జరుగుతున్నాయని, అధికారులకు ఫిర్యాదు చేసినా ఆధారాలు తెండి అంటూ చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజారోగ్యాన్ని వ్యాపారంగా మార్చిన ఈ సిండికేట్‌పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## మీసేవ కేంద్ర్రాల ద్వారా కూడా యూరియా బుకింగ్ : కలెక్టర్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రైతులకు అవసరమైన యూరియా ఎరువుల పంపిణీని మరింత సులభతరం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మీసేవ కేంద్రాల ద్వారా కూడా యూరియా బుకింగ్ కు అవకాశం కల్పించిందన్నారు. అన్ని మీ సేవ కేంద్రాల్లో యూరియా బుకింగ్ విధానం అందుబాటులోకి వచ్చిందని వెల్లడించారు. స్మార్ట్ ఫోన్ లేని, స్వయంగా ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోలేని రైతులు తమ సమీపంలోని మీసేవ కేంద్రాన్ని సందర్శించి బుక్ చేసుకోవచ్చని అన్నారు.స్మార్ట్ ఫోన్ సౌకర్యం లేని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ అవసరాలకు సరిపడా యూరియా ఎరువులు పొందాలని కలెక్టర్ సూచించారు. కాగా, ఈ విషయమై రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.



## ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠి అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్ర స్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించారు. గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. కలెక్టర్ వెంట ఏవో బాలరాజు, ఎన్నికల విభాగం సిబ్బంది సాత్విక్, విజయేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.





## సెలెక్ట్ కమిటీ మెంబర్, మైనారిటీ కమ్యూనిటీ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సెలెక్ట్ కమిటీ మెంబర్, మైనారిటీ కమ్యూనిటీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి సెలెక్ట్ కమిటీ మెంబర్, మైనారిటీ కమ్యూనిటీ ఛైర్మన్‌గా నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తిస్తూ, ప్రజా సేవలో మరింత ముందుంటానని, ముఖ్యంగా మైనారిటీ వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు.

## విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యం అవసరం : సీపీ




**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యం అవసరమని సీపీ సాయిచైతన్య అన్నారు. జోన్-2 బాసర లెవల్ పోలీస్ డ్యూటీ మీట్ 2026ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. విధినిర్వహణలో పోలీసుల సామర్థ్యం పెంచడానికి రాష్ట్రంలో మూడో పోలీస్ డ్యూటీ మీట్‌ను నిజామాబాద్‌లో ప్రారంభిస్తున్నామన్నారు. నిజామాబాద్, జగిత్యాల్, నిర్మల్, అదిలాబాద్ జిల్లాల పోలీసు అధికారులకు మీట్‌లో భాగంగా పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పోటీల ద్వారా పోలీస్ విభాగంలో కానిస్టేబుల్ స్థాయి నుండి సీఐ స్థాయి వరకు పని పద్ధతులు మెరుగుపడి ఇన్వెస్టిగేషన్ స్థాయిలు పెరుగుతాయన్నారు. పనిలో పోటీతత్వం అలవాటుపడుతుందన్నారు. సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్, ఫోరెన్సిక్, ఫింగర్ ప్రింట్ ఇన్వెస్టిగేషన్ కోసం ఎంపికలో భాగంగా గురువారం 'పోలీస్ క్లూస్' ఏ విధంగా సేకరించాలనే దానిపై పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. డ్యూటీ మీట్‌లో భాగంగా రెండు రోజుల పాటు పోటీలు జరుగుతాయని సీపీ పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాలను సైన్స్ ఇన్వెస్టిగేషన్ టూల్‌గా మార్చుకోవడం కోసం తమను తాము మెరుగుపర్చుకోవాలని సీపీ సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ అదనపు డీసీపీ (అడ్మిన్) శుభం ప్రకాష్, ఏసీపీలు ప్రకాష్ యాదవ్, సీటీసీ రాజశేఖర్, సీసీఎస్ శ్రీశైలం, సీసీఆర్‌బీ గురు నాయుడు, టాస్క్‌ఫోర్స్ నరేందర్, డాక్టర్ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

## టీ పాయింట్ ప్రారంభించిన ఎమ్మెల్యే కేవీఆర్

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలోని జీఆర్ కాలనీ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన త్రినేత్ర టీ పాయింట్‌ను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ప్రారంభించారు. ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి పీఏ మామిండ్ల రాజు ఈ టీ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. గురువారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ప్రజలకు రుచికరమైన నాణ్యమైన టీ అందిస్తామని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పాల ప్యాకెట్ల ద్వారా టీ తయారీకి స్వస్తి పలుకుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## 'సర్'లో ప్రతిఒక్కరూ పాల్గొనాలి.. రోహింగ్యాలను తరిమికొట్టాలి : ఎంపీ అర్వింద్




**అక్షరటుడే, ఇందూరు:** ప్రతి భారతీయుడు 'సర్' కార్యక్రమంలో పాల్గొని రోహింగ్యాలను, బంగ్లాదేశీయులను తరిమికొట్టాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. జానకంపేటలో గూడ్స్ షెడ్‌ను ప్రారంభించిన అనంతరం ఎంపీ నగరంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మాధవ నగర్ బ్రిడ్జి నిధుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందన్నారు. వంతెన వద్ద సెల్ఫీ వీడియో తీసినా కాంగ్రెస్ నేతలకు సిగ్గు రావడంలేదని ధ్వజమెత్తారు. రెండు గూడ్స్ షెడ్స్ తన హయాంలోనే రావడం ఆనందంగా ఉందని ఎంపీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేంద్రానికి ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వంపై బురద చల్లుతుందన్నారు. ధాన్యాన్ని కొంటున్నది తామేనని కాంగ్రెస్ నాయకులు ప్రగల్బాలు పలుకుతున్నారని ఆ ధాన్యాన్ని కేంద్ర పరిధిలోని ఎఫ్సీఐ కి ఇస్తున్న విషయం వారికి తెలియదా అని ప్రశ్నించారు. సర్ ప్లస్ బడ్జెట్ ఉన్నప్పటికీ అప్పులు తో రాష్ట్రాన్ని మాకు ఇచ్చారని కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారని ఇది ఎంతవరకు నిజమో వారే చెప్పాలని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో పార్టీపరంగా ప్రజలకు ఏం చేయవచ్చో న్యాయబద్ధంగా పూర్తి చేసి బీజేపీని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకొచ్చేందుకు శాయాశక్తుల కృషి చేస్తామని ఎంపీ అన్నారు. దీనికోసం ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని బాన్సువాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని ఆయన గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలోని బోర్లం గ్రామంలో పర్యటించిన ఆయన, ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ పురోగతిని సమీక్షించారు. బీఎల్ఓలతో సమావేశమైన ఇప్పటివరకు ఎన్ని ఎన్యుమరేషన్ ఫారాలు సేకరించారో, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో ఎలాంటి అపోహలు లేకుండా విస్తృత అవగాహన కల్పించాలని బీఎల్ఓలను ఆదేశించారు. బీఎల్ఓలు, బీఎల్ఏలకు ప్రజలు పూర్తి సహకారం అందించి, ఎన్యుమరేషన్ ఫారాలను సకాలంలో సమర్పించాలని ఆర్డీఓ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఏబీవీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా సంఘం రాష్ట్ర వర్కింగ్ మెంబర్ డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. ఏబీవీపీ ఎల్లప్పుడూ విద్యార్థులకు అండగా ఉంటూ, వారి సమస్యలపై పోరాడుతోందన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాల కోసం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. అలాగే దేశభక్తితో, దేశహితం కోరుకునేది ఏబీవీపీ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మ వెంకట్, ఎల్లారెడ్డి కౌన్సిలర్ రాజశేఖర్ రెడ్డి, ఎల్లారెడ్డి పూర్వ ఏబీవీపీ నాయకులు, కళాశాల విద్యార్థులు, ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేవాలయాల పరిరక్షణకు ప్రాధాన్యం : ఎమ్మెల్యే భూపతిరెడ్డి



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి అన్నారు. మాధవ్‌నగర్ సాయిబాబా ఆలయంలో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. ఆలయ పాలకవర్గ నూతన ఛైర్మన్ పొలసాని మీనా శ్రీనివాస్‌తో పాటు కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ప్రజలు ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగితే సమాజంలో శాంతి, సామరస్యం నెలకొంటాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేవాలయాలకు కొత్త శోభ వచ్చిందని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం సహా అనేక ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. మేయర్ ఉమారాణి, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, కేశ వేణు పాల్గొన్నారు.

# ‘గాంధారి విద్య’తో అద్భుతాలు..




‘గాంధారి విద్య’తో ఈ చిన్నారి అద్భుతాలు చేస్తోంది. తన ప్రతిభతో ‘ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్’లో చోటు సంపాదించింది. ఐదు విన్యాసాలను ఏకకాలంలో ప్రదర్శిస్తుండడంతో విద్యార్థినిపై ప్రశంసల జల్లు కురుస్తోంది.

– అక్షరటుడే, ఇందూరు

▪ ఐదు విన్యాసాలు ఒకేసారి ప్రదర్శిస్తున్న ప్రవశ్రీ ▪ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు..


నగరంలోని ప్రెసిడెన్సీ హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని కె. ప్రవశ్రీ కళ్లకు గంతలు కట్టుకుని ఒకసారి ఐదు విన్యాసాలు చేయడంలో ఆరితేరింది. ‘గాంధారి విద్య’గా పేరుగాంచిన ఈ విన్యాసాలను ఏకకాలంగా ప్రదర్శించి ఔరా అనిపిస్తోంది. నగరంలోని వివేకానంద సేవ సమితి ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన సమ్మర్ క్యాంప్‌లో కె.ప్రవశ్రీ ‘గాంధారి విద్య’ ప్రదర్శనతో అబ్బురపర్చింది. ఒకేసారి ఓవర్ బోర్డ్ మీద స్కేటింగ్, హులా హూప్ రింగ్ నడుము చుట్టూ తిప్పడం, తలపై దీపం పెట్టుకొని డాన్స్ స్టెప్స్ వేస్తూ, 2×2 రూబిక్స్ క్యూబ్‌ను క్షణాల్లో సాల్వ్ చేయడం, వీటన్నింటిని కళ్లు కనిపించకుండా సమతుల్యంగా చేయడం ద్వారా ఆమె ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించింది.




**కష్టమైన విన్యాసాలు..**

చూడడానికే కష్టమైన ఈ విన్యాసాలను ప్రవశ్రీ చిరునవ్వుతో, ఎలాంటి తడబాటు లేకుండా పూర్తి చేసింది. ఈ విన్యాసాలను గుర్తించిన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు ఆమె రికార్డుకు మెడల్, సర్టిఫికెట్, పెన్, ఐడీ కార్డు అందజేశారు. ఆస్ట్రేలియా, దుబాయ్, ఇటలీ వంటి దేశాల్లోనూ ప్రదర్శనలు ఇచ్చిన కె. ప్రవశ్రీ తన గురువు నవనీత మార్గదర్శకత్వంలో రికార్డు క్రియేట్ చేసింది. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులు సాయిప్రసాద్, వైష్ణవి మాట్లాడుతూ ‘కళ్లు మూసుకున్నా మనసు తెరిస్తే ఏదైనా సాధించొచ్చని’ ప్రవశ్రీ నిరూపించిందన్నారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో లో స్థానం సంపాదించడం తమ జీవితంలో గుర్తుండిపోయే క్షణమన్నారు.

## మురుగు కాల్వ మధ్యలో కరెంట్ స్తంభం..




**అక్షరటుడే, నిజామాబాద్ (ఆర్యనగర్):** అదో కొత్తగా వెలిసిన కాలనీ.. ప్లాట్లు కొనుక్కుని, ఇళ్లు కట్టుకుని ప్రశాంతంగా బతుకుదామనుకున్న స్థానికులకు నిజామాబాద్ నగర పాలక సంస్థ, విద్యుత్ శాఖ అధికారులు కలిసి ఒక ‘సరికొత్త’ ఇంజినీరింగ్ అద్భుతాన్ని బహుమతిగా ఇచ్చారు. అవును, మురుగు కాల్వల నిర్మాణంలో మన అధికారులు చూపించిన సమన్వయం, స్థానిక ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ చాతుర్యం చూస్తే ఎవరైనా ముక్కున వేలేసుకోవాల్సిందే! సాధారణంగా మురుగు కాల్వలు కట్టే ముందు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించడం, దానికి తగ్గట్టుగా విద్యుత్ శాఖకు సమాచారం ఇచ్చి, అంచనాలు వేసి, లైన్ మార్చడం అనేది నిబంధన. కానీ, మన మున్సిపల్ అధికారులకు అంత తీరిక ఎక్కడిది? “నిబంధనలు పుస్తకాల్లో ఉంటాయి.. మేము రోడ్డు మీదే చెత్తగా పనులు చేస్తాం” అన్నట్టుగా వ్యవహరించారు. విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకోకుండానే, అడ్డుగా ఉన్న కరెంట్ స్తంభాన్ని అలాగే ఉంచి, దాని చుట్టూ కాల్వ కట్టేసి చేతులు దులుపుకొన్నారు. కాల్వకు అడ్డంగా స్తంభం ఉంటే.. చెత్తాచెదారం అంతా అక్కడే ఆగిపోతుంది, మురుగు నీరు రోడ్డు పైకి తన్నుకొస్తుంది. ఈ సింపుల్ లాజిక్ అధికారులకు తట్టకపోవడం గమనార్హం.

## ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి శక్తిగా ఏబీవీపీ




**అక్షరటుడే, ఇందూరు:** విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి శక్తిగా ఏబీవీపీ ఎదిగిందని సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు పేర్కొన్నారు. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. నగరంలో విద్యార్థుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రాంబాబు మాట్లాడుతూ.. 1949 జూలై 9న ప్రారంభమైన ఏబీవీపీ కేవలం విద్యారంగ సమస్యలపైనే కాకుండా, విద్యార్థుల్లో జాతీయ భావాలు, సమాజంపై బాధ్యతను పెంపొందించడంలో ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ‘జ్ఞానం - శీలం - ఏకత’ అనే నినాదంతో కోట్లాది మంది విద్యార్థులను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేస్తోందని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ, ప్రభుత్వ హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ నిరంతరం రాజీలేని పోరాటాలు చేస్తోందని ఆయన చెప్పారు. రాబోయే రోజుల్లో విద్యార్థి లోకాన్ని ఏకం చేసి మరిన్ని ప్రజాస్వామ్య పోరాటాలకు సిద్ధమవుతామని తెలియజేశారు. హిందువు విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అమృత చారి, శివ ప్రసాద్, దుర్గాదాస్ సాయికుమార్, రక్షిత్, బాలకృష్ణ, సన్నీ, స్నేహిత్, చెర్రీ, లక్కీ, దీపన్, రాజకుమార్, దినేష్, రిచిత్ తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ టవర్ నిర్మాణాన్ని ఆపాలని ధర్నా..



**అక్షరటుడే, ఇందూరు:** నందిపేట్ మండలంలోని కుద్వాన్‌పూర్‌లో సెల్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని సర్పంచ్ మంగ్లారపు సుప్రియ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట గ్రామస్తులతో కలిసి ధర్నాకు దిగారు. ఆమె మాట్లాడుతూ.. పంచాయతీకి ఎలాంటి సమాచారం లేకుండా నిర్మాణం చేపట్టారని.. దీంతో గ్రామస్తులంతా కలిసి సర్పంచ్‌గా తనను నిలదీస్తున్నారన్నారు. జీపీ అనుమతి లేకుండా సెల్ టవర్ ఎలా నిర్మిస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారన్నారు. తక్షణమే నిర్మాణాన్ని ఆపాలని ఆమె డిమాండ్ చేశారు.

## వన మహోత్సవంలో భాగంగా ఇంటింటికీ మొక్కల పంపిణీ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కొక్కొండ గ్రామ పంచాయతీలో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, హరిత తెలంగాణ లక్ష్యంతో ప్రతి ఇంటికి కనీసం 2 మొక్కలను అందజేసి, వాటిని సంరక్షించే బాధ్యతను గ్రామస్తులకు అప్పగించారు.అధికారులు మొక్కల ప్రాముఖ్యతను, వాటిని పెంచే విధానాలను గ్రామస్తులకు వివరించారు. పచ్చదనం పెంచాలని సూచించారు. భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు వెంకవ్వ ప్రణీత్, పంచాయతీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



## ‘సర్’ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలి..

**అక్షరటుడే ఆర్మూర్:** ‘సర్’ నమోదు ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని సంతోష్ నగర్ కాలనీలోని 52వ బూత్‌లో నిర్వహిస్తున్న ‘సర్’ నమోదు ప్రక్రియను గురువారం పరిశీలించారు. తప్పులు దొర్లకుండా చూడాలని బీఎల్‌వోలకు సూచించారు.

## శ్రీకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూళ్లకు ఫస్ట్‌ఎయిడ్ కిట్ల అందజేత




**అక్షరటుడే, ఇందూరు:** శ్రీకృష్ణ ఫౌండేషన్ పలు స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో గురువారం ప్రభుత్వ పాఠశాలలకు ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందజేసింది. జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను అందజేశారు. రూరల్ మండలం ముబారక్ నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సైతం ఫస్ట్ ఎయిడ్ కిట్ అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ బాల కృష్ణ, నర్వోత్తం, ప్రసాద్, చిదంబరం, దుబ్బ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ‘సర్’ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలి..




**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో ‘సర్’ ప్రక్రియ కేవలం 30 శాతం మాత్రమే పూర్తయిందని, మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసి 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఆదేశించారు. పీసీసీ ఆదేశాల మేరకు గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ‘సర్’ పనుల పురోగతిని సమీక్షించిన ఆయన, ప్రక్రియను వేగవంతం చేసే బాధ్యతను డీసీసీ కార్యవర్గ సభ్యులకు అదనంగా అప్పగించారు. ఇప్పటి నుంచే ప్రతి డీసీసీ కార్యవర్గ సభ్యుడు గ్రామాల్లో పర్యటిస్తూ, మండల అధ్యక్షులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మండల స్థాయిలో సర్ ప్రక్రియను వేగవంతం చేయడంలో కీలకంగా వ్యవహరించాలన్నారు. సర్ కార్యక్రమం పార్టీకి అత్యంత ప్రాధాన్యత అంశమని, ప్రతి నాయకుడు బాధ్యతగా పనిచేసి నిర్దేశిత సమయంలోపు జిల్లాలో ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, పార్టీ పట్టణ అధ్యక్షుడు సందీప్, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

## తెయూలో నీటి కటకట.. రోడ్డెక్కిన విద్యార్థినులు




**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీ గర్ల్స్ హాస్టల్‌లో గత కొన్ని రోజులుగా నీటిసమస్య ఇబ్బందులు పెడుతోందని విద్యార్థినులు పేర్కొంటున్నారు. కనీస అవసరాలకు కూడా తగినంత నీరు అందుబాటులో లేకపోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గురువారం ఉదయం వారు వర్సిటీలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. రోజువారీ అవసరాలకు..ఇతరత్ర పనులకు నీళ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థినులు వాపోతున్నారు. అనేకసార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఇప్పటి వరకు ఎలాంటి శాశ్వత పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల భయంతో ఈ విషయాన్ని విద్యార్థినులు బయటికి చెప్పలేకపోతున్నారని తెలుస్తోంది. 15 రోజులలో ఏ ఒక్కరోజు కూడా పూర్తిగా నీటి సరఫరా జరిగిన దాఖలాలు లేవని .. ప్రతిరోజూ ఏదో సమస్య చెబుతూ.. వస్తున్నారని మొరపెట్టుకున్నారు. నీటి సమస్య పరిష్కరించాలని కోరారు.

## మాంసం దుకాణాదారులు పరిశుభ్రత పాటించాలి




**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణంలోని చికెన్, మటన్, ఇతర మాంసం విక్రయ కేంద్రాల యజమానులకు మున్సిపల్ అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. వర్షాకాలంలో దుకాణదారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఈ నోటీసుల ద్వారా స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్ గజానంద్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నందున, మాంసం దుకాణాల యజమానులు ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని ఆదేశించారు. వినియోగదారులకు ఎల్లప్పుడూ స్వచ్ఛమైన, నాణ్యమైన మాంసాన్ని మాత్రమే అందించాలని స్పష్టం చేశారు. విక్రయించే మాంసంపై ఈగలు, దోమలు, ఇతర క్రిమికీటకాలు వాలకుండా ముందస్తు రక్షణ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. దుకాణాల పరిసరాల్లో పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు వ్యాపారులు సహకరించాలని కమిషనర్ కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. మున్సిపల్ మేనేజర్ నరేందర్, అధికారులు ఓంకార్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.